ప్రభాత
# ఉదయం
తెలుగు దినపత్రిక

**రిపోర్టర్లు కావలెను**

అత్యంత ప్రజాదరణ పొందిన ప్రభాత ఉదయం తెలుగు దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణ వ్యాప్తంగా జిల్లా, మండల మరియు నియోజకవర్గాల వారీగా రిపోర్టర్లు కావలెను.

ఉదయం

సంప్రదించండి
ఫోన్: 93910 89608

సంపుటి: 2 | సంచిక: 257 | పేజీలు: 4 | వెల: రూ.3/- | సోమవారం 23 డిసెంబర్ 2024 | ఎడిటర్: కోట్ల చంద్రకాంత్

# అల్లు అర్జున్ ఇంటిపై దాడి

### తీవ్ర ఉద్రిక్తత - భారీగా పోలీసుల మోహరింపు

### అల్లు అర్జున్ ఇంటిపై రాళ్లు విసిరిన ఓయూ జేఏసీ నాయకులు

**హైదరాబాద్, డిసెంబర్ 22 (ప్రభాత ఉదయం):** ఓయూ జేఏసీ విద్యార్థి సంఘాల ఆందోళనతో జూబ్లీహిల్స్‌లోని అల్లు అర్జున్ ఇంటి వద్ద తీవ్ర ఉద్రిక్తత చోటు చేసుకుంది. రేవతి మరణానికి అల్లు అర్జునే కారణమంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. మృతురాలు రేవతి కుటుంబానికి వెంటనే రూ.కోటి పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ క్రమంలో కొందరు నిరసనకారులు అల్లు అర్జున్ నివాసంపై రాళ్లు విసిరారు. ఆయన ఇంట్లోకి నినాదాలు చేసుకుంటూ దూసుకెళ్లేందుకు యత్నించారు. రాళ్లు తగిలి అల్లు అర్జున్ ఇంటి ఆవరణలోని పూల కుండీలు, గార్డెన్‌లోని మొక్కలు ధ్వంసమయ్యాయి. విద్యార్థి సంఘాల ఆందోళన నేపథ్యంలో పోలీసులు అక్కడికి చేరుకుని వారిని అదుపులోకి తీసుకున్నారు. నివాసం దగ్గర అదనపు పోలీసు బలగాలతో బందోబస్తు ఏర్పాటు చేశారు. పోలీసులు భారీగా మోహరించారు. ఘటన జరిగిన సమయంలో నటుడు అల్లు అర్జున్ తన నివాసంలో లేరని సమాచారం. విషయం తెలుసుకున్న ఆయన మామ, కాంగ్రెస్ నేత కంచర్ల చంద్రశేఖర్ రెడ్డి అక్కడికి చేరుకుని ఈ ఘటనపై ఆరా తీస్తున్నారు. జరిగిన రాళ్ల దాడిపై సెక్యూరిటీ సిబ్బంది జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేసే అవకాశమున్నట్టు తెలుస్తోంది. సంయమనం పాటించాలి : అల్లు అర్జున్ ఇంటిపై జరిగిన దాడిపై ఆయన తండ్రి అల్లు అరవింద్ స్పందించారు. "మా ఇంటి ముందు జరిగిన ఘటన మీరంతా చూశారు. ఇలా ఎవరికీ జరగకూడదు. ఇలాంటి పరిస్థితుల్లో అందరూ సమయనం పాటించాలి అదే మంచిది. తొందరపడి చర్యలకు దిగొద్దు" అని అల్లు అరవింద్ తెలిపారు. ఈ రాళ్ల దాడిపై పోలీసులకు ఫిర్యాదు చేశారా? అని మీడియా ప్రశ్నకు అల్లు అరవింద్ స్పందించకుండా వెళ్లిపోయారు.



**దాడిని ఖండించిన సీఎం రేవంత్ రెడ్డి** 2

## అల్లు అర్జున్ సీఎంకు
# క్షమాపణ చెప్పాలి

### సినీ ఇండస్ట్రీ పెద్దలపై మంత్రి కోమటిరెడ్డి సంచలన వ్యాఖ్యలు

### అల్లు అర్జున్‌పై మంత్రి కోమటిరెడ్డి తీవ్ర ఆగ్రహం

**హైదరాబాద్, డిసెంబర్ 22 (ప్రభాత ఉదయం):** తెలంగాణలో సంధ్య థియేటర్ తొక్కిసలాట ఘటన సంచలనం రేకెత్తించగా.. శనివారం అసెంబ్లీలో అల్లు అర్జున్‌పై సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు అటు సినీ, ఇటు రాజకీయ వర్గాల్లో తీవ్ర ప్రకంపనలు రేపాయి. ప్రస్తుతం తెలుగు రాష్ట్రాల్లో ఇది హాట్ టాపిక్‌గా మారింది. తాజాగా, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి.. అల్లు అర్జున్, సినీ ఇండస్ట్రీపై సంచలన వ్యాఖ్యలు చేశారు. శనివారం ఐకాన్ స్టార్ ప్రెస్ మీట్‌పై ఆయన స్పందించారు. సీఎం రేవంత్ రెడ్డికి బన్నీ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. తన ఇమేజ్ దెబ్బతీశారంటూ సీఎం వ్యాఖ్యలపై ఎదురుదాడిగా మాట్లాడడం సరికాదన్నారు.



**'మానవత్వం లేకుండా ఉంటారా.?'**

'ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాలుడు శ్రీతేజ్‌ను పరామర్శించేందుకు లీగల్ టీమ్ ఒప్పుకోలేదని అల్లు అర్జున్ అనడం హాస్యాస్పదం. అసెంబ్లీలో ఈ విషయాన్ని ప్రస్తావిస్తే ఇమేజ్ దెబ్బతిన్నదని ..మిగతా 2లో

## చదరంగంలో చంద్రబాబు మనవడు
# దేవాన్ష్ ప్రపంచ రికార్డు

ప్రతిష్టాత్మకమైన వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ లండన్ నుంచి అధికారిక ధృవీకరణ పత్రాన్ని అందుకున్న దేవాన్ష్.. హర్షం వ్యక్తం చేసిన నారా కుటుంబం 2

# ప్రజల ప్రాణాలే మాకు ముఖ్యం

### తెలంగాణ డీజీపీ



**హైదరాబాద్, డిసెంబర్ 22 (ప్రభాత ఉదయం):** సంధ్య థియేటర్ వద్ద పుష్ప 2 ప్రీమియర్ షో సందర్భంగా తొక్కిసలాట జరిగి రేవతి అనే మహిళ చనిపోగా, ఆమె కుమారుడు శ్రీతేజ్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నాడు. అల్లు అర్జున్ సినిమా హీరో అయి ఉండొచ్చు, కానీ ఓ పౌరుడిగా బాధ్యతాయుతంగా ఉండాలని తెలంగాణ డీజీపీ జితేందర్ అన్నారు. అల్లు అర్జున్‌కి మేం వ్యతిరేకం కాదు. కానీ ఏదైనా అవాంఛనీయ ఘటన జరిగితే చట్టప్రకారం యాక్షన్ తీసుకుంటాం. థియేటర్ వద్ద ఆ రోజు జరిగిన సంఘటన దురదృష్టకరం అన్నారు. కరీంనగర్ జిల్లా కొత్తపల్లిలో భరోసా కేంద్రాన్ని డీజీపీ జితేందర్ ఆదివారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పోలీసులు ఎవరికీ వ్యతిరేకం కాదు. పౌరుల రక్షణ, భద్రతకు అధిక ప్రాధాన్యం ఇస్తాం. అల్లు అర్జున్ సినిమా హీరో కావొచ్చు. బయట మాత్రం ఆయన ఓ సాధారణ ..మిగతా 2లో

# అల్లు అర్జున్ చెప్పిందంతా అబద్ధమేనా?



### సంచలన విషయాలు వెల్లడించిన పోలీసులు
### సంధ్య థియేటర్ ఘటన
### అల్లు అర్జున్‌పై సీపీ కామెంట్స్

**హైదరాబాద్, డిసెంబర్ 22 (ప్రభాత ఉదయం):** సంధ్య థియేటర్ ఘటనపై శనివారం అసెంబ్లీలో సీఎం రేవంత్ రెడ్డి చేసిన కామెంట్స్‌తో ఈ వ్యవహారం మరోసారి తెలుగు రాష్ట్రాల్లో హాట్ టాఫిక్‌గా ..మిగతా 2లో



## మోదీకి కువైట్
# అత్యున్నత పురస్కారం

### ద్వైపాక్షిక సంబంధాల బలోపేతంపై ఇరు దేశాలు ఫోకస్
### భారత ప్రధానమంత్రి నరేంద్రమోదీకి మరో అరుదైన గౌరవం
### తమ దేశ అత్యున్నత పౌర పురస్కారంతో సత్కరించిన కువైట్ రాజు

**కువైట్, డిసెంబర్ 22 (ప్రభాత ఉదయం):** కువైట్ పర్యటనలో ఉన్న ప్రధాని నరేంద్ర మోదీ ఆ దేశ అత్యున్నత పౌర పురస్కారం 'ది ఆర్డర్ ఆఫ్ ముబారక్ ద గ్రేట్' అందుకున్నారు. కువైట్ రాజు షేక్ మేషాల్ అల్-అహ్మద్ అల్-జబేర్ అల్-సబా ఈ అవార్డు అందజేశారు. అనంతరం రెండు దేశాల మధ్య సంబధాలు బలోపేతం చేసేలా ఇరువురు ద్వైపాక్షిక చర్చలు జరిపారు. ఇరుదేశాల మధ్య సంబంధాల బలోపేతంతోపాటు ఫార్మా, ఐటీ, ఫిన్‌టెక్, సెక్యూరిటీ. ఇంధనం ..మిగతా 2లో

# అంగీకార శృంగారం రేప్ కాదు

### వేధింపుల కోసం చట్టాన్ని వాడుకోవద్దు
### ఢిల్లీ హైకోర్టు సంచలన తీర్పు




**న్యూఢిల్లీ, డిసెంబర్ 22 (ప్రభాత ఉదయం):** పరస్పర అంగీకారంతో జరిగిన శృంగారాన్ని లైంగిక దాడిగా పరిగణించలేమని ఢిల్లీ హైకోర్టు సంచలన తీర్పు ఇచ్చింది. చట్టంలోని సెక్షన్లను కొందరు పురుషులను వేధించేందుకు ఉపయోగిస్తున్నారని స్పష్టం చేసింది. తనపై నమోదైన రేప్ కేసును కొట్టివేయాలంటూ ఓ యువకుడు దాఖలు చేసిన పిటిషన్‌ను విచారించిన జస్టిస్ చంద్రధారి సింగ్‌తో కూడిన ధర్మాసనం యువతి ఉద్దేశపూర్వకంగానే కేసు పెట్టినట్టు స్పష్టమవుతున్నదని పేర్కొంది. ఈ మేరకు యువకుడిపై నమోదైన ఎఫ్‌ఐఆర్‌ను కొట్టివేయాలని పోలీసులను ఆదేశించింది. కేసు విచారణ, తీర్పు సందర్భంగా హైకోర్టు న్యాయమూర్తి కీలక వ్యాఖ్యలు చేశారు. అత్యాచారం మహిళలపై జరిగే చాలా హేయమైన చర్య. కానీ కొందరు మహిళలు తమతో సంబంధం కలిగిన పురుషుడిని వేధించేందుకు చట్టాన్ని ఆయుధంగా ..మిగతా 2లో


# ఇకపై పోలింగ్ సీసీటీవీ ఫుటేజ్ చెక్ చేసేందుకు నో ఛాన్స్

### ఈసీ కొత్త రూల్స్!
### సీసీ కెమెరాల వీడియోలు, వెబ్‌కాస్టింగ్ బహిరంగపరచకుండా చర్యలు
### అభ్యర్థులపై వీడియో రికార్డింగుల వెల్లడీ నిషేధం
### నిబంధనల్లో ఈసీ మార్పులు




**హైదరాబాద్, డిసెంబర్ 22 (ప్రభాత ఉదయం):** ఎన్నికలకు సంబంధించిన ఎలక్ట్రానిక్ రికార్డులను ఎవరైనా తనిఖీ చేసేందుకు అనుమతించే నిబంధనల్లో ఎన్నికల సంఘం (ఈసీ) మార్పులు చేసింది. ఇక నుంచి పోలింగ్‌కు సంబంధించిన సీసీ టీవీ ఫుటేజ్‌ను, వెబ్‌కాస్టింగ్ రికార్డులను, అభ్యర్థులకు చెందిన వీడియో రికార్డులను తనిఖీ చేయకుండా నిషేధం విధించింది. దీనిపై కాంగ్రెస్ మండిపడింది. ఎన్నికల్లో పారదర్శకతకు ఇది విఘాతమని స్పష్టం చేసింది. ఎన్నికల సంఘం సిఫార్సు మేరకు ఎన్నికల నిర్వహణ నిబంధనలు-1961లోని రూల్ 93(2)(ఏ)ను శుక్రవారం కేంద్ర న్యాయశాఖ సవరించింది. ఈ సవరణకు ఓ కోర్టు కేసు కారణమని ఈసీతోపాటు న్యాయశాఖ వేర్వేరుగా వివరణ ఇచ్చాయి. కొత్త సవరణతో ఎలక్ట్రానిక్ రికార్డులు మినహా ఇతర ..మిగతా 2లో

ప్రభాత ఉదయం తెలుగు దినపత్రిక



## మోదీకి కువైట్ అత్యున్నత పురస్కారం

మొదటి పేజీ తరువాయి...

వంటి కీలక రంగాల్లో సహకారంపై చర్చించినట్లు ప్రధాని మోదీ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. ' ఇది అద్భుతమైన భేటీ. ఇరుదేశాల మధ్య సంబంధాలు మరింత బలపడటానికి తీసుకోవాల్సిన చర్యలపై దృష్టి సారించాం. ఇరుదేశాల మధ్య సాధారణ భాగస్వామ్యాన్ని వ్యూహాత్మక స్థాయికి తీసుకెళ్లాం.' అని మోదీ వెల్లడించారు. ఆ తర్వాత కువైట్ యువరాజు షేక్ సబా అల్-ఖలీద్ అల్-సబాతోనూ ప్రధాని మోదీ భేటీ అయ్యారు. రక్షణ, వాణిజ్యం సహా కీలకరంగాల్లో ఇరుదేశాల మధ్య సంబంధాల బలోపేతంపై చర్చలు జరిపారు. భారత్‌కు చెందిన అగ్రశ్రేణి వ్యాపార భాగస్వాముల్లో కువైట్ ఒకటి కాగా, 2023-24 ఆర్థిక సంవత్సరోలో ఇరుదేశాల మధ్య ద్వైపాక్షిక వాణిజ్యం 10.47 బిలియన్ డాలర్లకు చేరింది. అంతకుముందు ప్రధాని మోదీ కువైట్ రాజప్రసాదం వద్ద అధికారిక స్వాగతంతోపాటు గార్డ్ ఆఫ్ హానర్ అందుకున్నారు. రెండు రోజుల పర్యటనలో భాగంగా శనివారం కువైట్ చేరుకున్న ప్రధాని మోదీ మొదటిరోజు ప్రవాస భారతీయులు ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ప్రసంగించారు. అనంతరం భారతీయ కార్మికుల శిబిరాన్ని సందర్శించి, వారితో కొంచెం సేపు ముచ్చటించారు. గత 43 ఏళ్లలో భారత ప్రధాని కువైట్‌లో పర్యటించడం ఇదే తొలిసారి. ప్రధాని మోదీకి లభించిన 20వ అంతర్జాతీయ పురస్కారం ఇది. స్నేహానికి చిహ్నంగా దేశాధినేతలకు, రాజకుటుంబ సభ్యులకు కువైట్ ఈ పురస్కారం అందజేస్తుంది. గతంలో అమెరికా మాజీ అధ్యక్షులు బిల్ క్లింటన్, జార్జ్ బుష్ తదితరులు దీన్ని అందుకున్నారు.

## ప్రజల ప్రాణాలే మాకు ముఖ్యం

మొదటి పేజీ తరువాయి...

పౌరుడు. ప్రతి పౌరుడు తమ వంతుగా బాధ్యతాయుతంగా ప్రవర్తించడం ఎంతైనా అవసరం. క్షేత్రస్థాయిలో పరిస్థితులు అర్థం చేసుకుని మసలుకోవాలి. సినిమా ప్రమోషన్లు, ఈవెంట్ల కంటే మాకు ప్రజల భద్రతే ముఖ్యం. ప్రజల ప్రాణాల కంటే సినిమా ఈవెంట్లు ముఖ్యమైన విషయం కాదు. చట్టాన్ని అతిక్రమిస్తే ఎవరిపై అయినా చర్యలు తప్పవు. అల్లు అర్జున్‌కు తాము వ్యతిరేకం కాదని' స్పష్టం చేశారు.

సినిమా నటులైనప్పటికీ బయట వీరు సాధారణ పౌరుల్లా వ్యవహరించాలి. సినీ నటుడు మోహన్ బాబుపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఆయన విషయం కుటుంబ సమస్య కానీ, జర్నలిస్టుపై దాడితో మోహన్ బాబుపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటాం. పరిమితులకు లోబడి, పరిస్థితిని అర్థం చేసుకుని వ్యవహరిస్తే ఎవరికీ ఏ సమస్యా ఉండదు. లేనిపక్షంలో కేసుల్లో ఇరుక్కుని ఇబ్బందులు పడాల్సి వస్తుంది. - తెలంగాణ డీజీపీ

**మధ్యంతర బెయిల్ రావడంతో అల్లు అర్జున్ విడుదల**

సంధ్య థియేటర్ వద్ద పుష్ప 2 ప్రీమియర్ షో సందర్భంగా డిసెంబర్ 4న తొక్కిసలాట జరిగింది. ఈ ఘటనలో రేవతి అనే మహిళ మృతిచెందగా, ఆమె కుమారుడు శ్రీతేజ్ సికింద్రాబాద్ లోని కిమ్స్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నాడు. కొన్ని రోజుల కిందటితో పోల్చితే బాలుడి పరిస్థితి కొంచెం మెరుగైందని హాస్పిటల్ శనివారం హెల్త్ బులెటిన్ విడుదల చేసింది. చిక్కడపల్లి పోలీసులు దీనిపై కేసు నమోదు చేసి అల్లు అర్జున్ సహా కొందరు నిందితుల్ని అరెస్ట్ చేశారు. అల్లు అర్జున్ కు నాంపల్లి కోర్టు రెండు వారాల రిమాండ్ విధించగా చంచల్ గూడ జైలుకు తరలించారు. హైకోర్టుకు వెళ్లడంతో నటుడికి నాలుగు వారాల మధ్యంతర బెయిల్ రావడంతో జైలు నుంచి విడుదలయ్యారు.

**ప్రైవేట్ బాడీ గార్డ్స్, బౌన్సర్లు హద్దుల్లో ఉండాలి..**

బౌన్సర్లు, ప్రైవేట్ బాడీ గార్డ్స్ పేరుతో చట్టానికి వ్యతిరేకంగా ఎవరిపైనైనా దాడులు, బెదిరింపులు చేస్తే క్రిమినల్ కేసులతో జైలు ఊచలు లెక్కించాల్సి వస్తుందని తెలంగాణ పోలీసులు హెచ్చరించారు. బౌన్సర్లకైనా,ప్రైవేట్ బాడీ గార్డ్స్ కైనా పరిమితులు ఉంటాయని, నిబంధనలు అతిక్రమిస్తే కేసులు వెంటాడుతాయని స్పష్టం చేశారు.

## అంగీకార శృంగారం రేప్ కాదు

మొదటి పేజీ తరువాయి...

వాడుకుంటున్నారు. యువకుడు సమర్పించిన వాట్సప్ చాటింగ్‌లు, రికార్డింగ్స్ బట్టి చూస్తే ఇద్దరూ పరస్పరం అంగీకారంతోనే శారీరక బంధంలోకి ప్రవేశించినట్టు స్పష్టమవుతున్నది. స్త్రీలు చట్టాన్ని దుర్వినియోగం చేయడం వల్ల పురుషులు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కొంటారో చెప్పేందుకు ఈ కేసు స్పష్టమైన ఉదాహరణ. ఇలాంటి కేసుల్లో ఫిర్యాదుదారుల ఉద్దేశాలను కూడా కోర్టులు పరిశీలించాలి. అని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ తరఫు న్యాయవాది యువకుడిపై యువతి తీవ్రమైన ఆరోపణలు చేశారని, కేసును కొట్టివేయవద్దని కోరారు. స్పందించిన న్యాయమూర్తి ఆధారాల ప్రకారం చూస్తే ఇరువురు పెళ్లి చేసుకోవాలని అనుకున్నారు. కానీ కులాలు వేర్వేరు కావడంతో ఇరువురి కుటుంబ సభ్యులు ఒప్పుకోలేదు. కుటుంబ సభ్యులు ఒప్పుకోకపోయినా పెళ్లి చేసుకోవడానికి సిద్ధమని యువకుడు తెలిపాడు. కానీ ఆమె మరో యువకుడితో పెళ్లికి అంగీకరించడంతో ప్రేమించిన యువకుడితో పెళ్లికి ఆసక్తి చూపలేదు అని న్యాయమూర్తి తెలిపారు. అందువల్ల యువకుడిపై నమోదు చేసిన ఎఫ్ఐఆర్ దురుద్దేశపూర్వకమైనదేనని, కాబట్టి కేసు చెల్లదని స్పష్టం చేశారు.

## వడ్డీతో సహా ఆ డబ్బులు కట్టండి.. వర్మకు ఏపీ సర్కారు షాక్



**హైదరాబాద్, డిసెంబర్ 22 (ప్రభాత ఉదయం):** వివాదాస్పద దర్శకుడు రామ్ గోపాల్ రోజుకో రకంగా వార్తల్లో నిలుస్తున్నారు. సోషల్ మీడియాలో చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌లపై అభ్యంతరకర పోస్టుల కేసులో హైకోర్టులో ఆయన ఊరట లభించింది. కానీ, ఇప్పటికే వ్యూహం సినిమాలో పలువురు టీడీపీ నేతల ఫోటోలు ఉపయోగించి వ్యంగంగా చూపినట్టు ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. కానీ రామ్ గోపాల్ వర్మ మాత్రం ఈ కేసు విచారణకి హాజరు కావడం లేదు. అయితే, ఈ కేసుని మరింత లోతుగా విచారిస్తోంది ఏపీ ప్రభుత్వం. ఈ క్రమంలో మరోసారి రామ్ గోపాల్ వర్మకి కూటమి సర్కారు షాక్ ఇచ్చింది. వ్యూహం సినిమాని ఏపీలో ప్రసారం చెయ్యడానికి ఏపీ ఫైబర్ నెట్‌కు విక్రయించగా.. ఈ క్రమంలో సినిమాకి వ్యూస్ లేకపోయినా రూ. 1.15 కోట్లు చెల్లించినట్లు గుర్తించారు. దీంతో ప్రభుత్వం వ్యూహం చిత్ర యూనిట్ ఈ సొమ్ము వడ్డీతో సహా చెల్లించాలని నోటీసులు ఇచ్చింది. ఒకవేళ 15 రోజుల్లో ఈ డబ్బు చెల్లించకపోతే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొంది

# అల్లు అర్జున్ చెప్పిందంతా అబద్ధమేనా?

మొదటి పేజీ తరువాయి...



మారింది. అల్లు అర్జున్ అత్యుత్సాహం, పోలీసుల మాట వినకపోవటం వల్లే రేవతి అనే మహిళ చనిపోవటమే కాకుండా ఆమె కుమారుడు చావు బతుకుల మధ్య పోరాడుతున్నారని రేవంత్ అసెంబ్లీ వెల్లడించారు. రేవంత్ కామెంట్లపై అల్లు అర్జున్ సైతం స్పందించారు. శనివారం రాత్రి ప్రెస్‌మీట్ పెట్టిన ఆయన.. సీఎం వ్యాఖ్యలు బాధ కలిగించాయని చెప్పారు. పోలీసులు పర్మిషన్ ఇస్తేనే తాను థియేటర్‌కు వెళ్లాలని.. రేవతి చనిపోయిన విషయం తనకు మర్నాడు తెలిసిందన్నారు.

కాగా, అల్లు అర్జున్ చేసిన ఈ కామెంట్లపై తాజాగా హైదరాబాద్ సీపీ కీలక విషయాలు వెల్లడించారు. ఆ రోజు థియేటర్ వద్ద ఏం జరిగిందో మీడియాకు తెలిపారు. అందుకు సంబంధించిన వీడియో దృశ్యాలను కూడా మీడియాకు చూపించారు. ప్రత్యక్ష సాక్షి, డ్యూటీలో ఉన్న చిక్కడపల్లి ఏసీపీ రమేష్ ద్వారా జరిగిన విషయాన్ని వెల్లడించారు. ఏసీపీ రమేష్ ఏం చెప్పారో ఆయన మాటల్లోనే.. 'అల్లు అర్జున్ మేనేజర్ సంతోష్‌కు ముందు తెలియజేశాం. ఒక లేడీ చనిపోయారు.. ఓ పిల్లాడు తీవ్ర గాయాల పాలయ్యాడు.. పరిస్థితి కంట్రోల్‌లో లేదని చెప్పాం. మీకు ఇబ్బంది ఉంటుంది అని చెప్పాం. ముందు అల్లు అర్జున్ మేనేజర్ మమ్మల్ని కలవనివ్వలేదు. మేం అల్లు అర్జున్‌కు చెబుతామని సంతోష్ అన్నారు. కానీ వారు వెళ్లలేదు. అదే సమయంలో మా డీసీపీ సార్ వచ్చారు.

డీసీపీ సార్ సూచనతో వాళ్లను నెట్టుకుంటూ నేను అల్లు అర్జున్ వద్దకు వెళ్లాను. అల్లు అర్జున్ చెవిలో చెప్పాను. ఓ లేడీ చనిపోయిందని.. పిల్లాడు గాయపడ్డాడని చెప్పాను. పరిస్థితి చేయిదాటిపోయే ప్రమాదం ఉందని.. పోలీసులు రూట్ క్లియర్ చేశామని ఆయనకు చెప్పాం. అయినా అల్లు అర్జున్ వినిపించుకోలేదు. సినిమా పూర్తయిన తర్వాతే వెళ్తానని అల్లు అర్జున్ అన్నారు. అప్పుడు మా డీసీపీ సార్‌కు చెప్పాం. అప్పుడు సార్, మేం మరోసారి లోపలికి వెళ్లాం. ఓ 10-15 నిమిషాలు టైం ఇచ్చాం. ఆ తర్వాత ఆయన్ను బయటకు తీసుకొచ్చాం. వాస్తవంగా జరిగింది ఇదే.' అని రమేష్ వెల్లడించారు.

ఇక సోషల్ మీడియాలో వైరల్‌గా మారిన పర్మిషన్ లెటర్‌పై కూడా పోలీసులు కీలక విషయాలు వెల్లడించారు. తాము థియేటర్ యాజమాన్యానికి ఎటువంటి పర్మిషన్ ఇవ్వలేదని చెప్పారు. లెటర్ ఓ వైపు మాత్రమే వైరల్ చేస్తున్నారు. పర్మిషన్ లెటర్ వెనకాలే కుదరని రాసినట్లు స్టేషన్ ఎస్ఎచ్‌వో రాజు నాయక్ వెల్లడించారు. తాను ఓరల్‌గా కూడా వారికి పర్మిషన్ లేదని చెప్పినట్లు తెలిపారు. సీపీ సీవీ ఆనంద్ మాట్లాడుతూ.. సంధ్య థియేటర్ ఘటనలో ఇంకా ఏం కాలేదని.. ఇక ముందు ఇంకా చాలా ఉందని చెప్పారు. కేసు కోర్టులో ఉన్నందను ఇంతకు మించి వివరాలు వెల్లడించలేమని అన్నారు. పోలీసులు చెప్పిన వివరాల ప్రకారం.. ఇప్పడి వరకు అల్లు అర్జున్ చెప్పినదంతా అబద్ధమని.. కొందరు సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారు.

## అల్లు అర్జున్ సీఎంకు క్షమాపణ చెప్పాలి

మొదటి పేజీ తరువాయి...

అంటున్నారు. ఇది పద్ధతి కాదు. అల్లు అర్జున్ పర్మిషన్ లేకుండా థియేటర్‌కు వెళ్లాడు. మా వద్ద అన్ని ఆధారాలున్నాయి. బన్నీ కామెంట్స్ సీఎంను అగౌరవపరిచే విధంగా ఉన్నాయి. వాటిని వెనక్కి తీసుకోవాలి.' అని మంత్రి కోమటిరెడ్డి డిమాండ్ చేశారు. ఆస్పత్రిలో ఉన్న శ్రీతేజ్‌ను చిరంజీవి ఎందుకు పరామర్శించట్లేదని ఆయన ప్రశ్నించారు. సినిమా ఇండస్ట్రీ వాళ్లు మొత్తం ఇలాగే మానవత్వం లేకుండా ఉంటారా.? అంటూ నిలదీశారు. తెలంగాణలో ఇక బెనిఫిట్ షోలు ఉండవంటూ స్పష్టం చేశారు. అటు, శనివారం తెలంగాణ అసెంబ్లీ ముగిసిన వెంటనే మంత్రి కోమటిరెడ్డి సికింద్రాబాద్‌లోని కిమ్స్ ఆస్పత్రికి వెళ్లి బాలుడు శ్రీతేజ్‌ను పరామర్శించారు. బాలుని ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. అనంతరం రేవతి కుటుంబాన్ని పరామర్శించారు. అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. అటు, రేవతి కుటుంబానికి రూ.25 లక్షల ఆర్థిక సాయం చేస్తామని ప్రకటించారు.

మరోవైపు, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అల్లు అర్జున్‌పై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి మాటలను తప్పుపట్టేలా బన్నీ వ్యవహరిస్తున్నారని.. ఆయన తీరు దారుణంగా ఉందని అన్నారు. 'అల్లు అర్జున్‌లో కనీసం పశ్చాత్తాపం కనిపించట్లేదు. రేవతి కుటుంబంపై సానుభూతి చూపించలేదు. మజ్లిస్ ఎమ్మెల్యే అక్బరుద్దీన్ తెచ్చిన ప్రస్తావనపైనే సీఎం స్పందించారు. పోలీసులు చెప్పినా వినకుండా అల్లు అర్జున్ థియేటర్‌లో షో చేశారు. ప్రాణాల కంటే పేరు ప్రతిష్టలు ఎక్కువా.?' అంటూ నిలదీశారు.

కాగా, సంధ్య థియేటర్ వద్ద తొక్కిసలాట ఘటనకు హీరో అల్లు అర్జున్ రావడమే కారణమని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఎంఐఎం ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఈ విషయంపై రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించగా.. దీనికి అసెంబ్లీలో సీఎం సమాధానమిచ్చారు. ఓ హీరో తన సినిమా చూసేందుకు థియేటర్‌కు రావడంతో జరిగిన తొక్కిసలాటలో ఓ మహిళ చనిపోగా.. ఆమె కుమారుడు చావుబతుకుల మధ్య ఉన్నాడని.. ఆ సమయంలోనూ నటుడు వాహనం రూఫ్ టాప్ నుంచి ఫ్యాన్స్‌కు అభివాదం చేస్తూ వెళ్లిపోయారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తొక్కిసలాట ఘటనపై ప్రభుత్వం చర్యలు చేపట్టిందని, బాధ్యులైన థియేటర్ యాజమాన్యంతో పాటు హీరోపై కేసులు నమోదు చేసి అరెస్ట్ చేశామన్నారు. ఈ వ్యాఖ్యలను బన్నీ తప్పుపట్టారు.

## సైబర్ నేరాల్లో రూ.297 కోట్లు పోగొట్టుకున్న బాధితులు: సీవీ ఆనంద్



**హైదరాబాద్, డిసెంబర్ 21 (ప్రభాత ఉదయం):** హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో ఈ ఏడాది సైబర్ నేరాలకు గురైన బాధితులు రూ.297 కోట్లు పోగొట్టుకున్నారని కమిషనర్ సీవీ ఆనంద్ తెలిపారు. చాలామంది పరువు పోతుందని ఫిర్యాదు చేసేందుకు కూడా ముందుకు రావడం లేదని చెప్పారు. హైదరాబాద్ కమిషనరేట్ వార్షిక మీడియా సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన పలు కీలక వ్యాఖ్యలు చేశారు. డయల్ 100కి వస్తున్న ఫిర్యాదులపై స్పందన పెరిగింది. ఫిర్యాదులు వచ్చిన తర్వాత ఘటనాస్థలానికి వెళ్లే సమయం కూడా బాగా తగ్గింది. రాత్రిపూట కూడా పోలీసుల గస్తీ పెంచాం. ధ్వని కాలుష్యంపై తాము తీసుకున్న నిర్ణయాలకు ప్రజల నుంచి మద్దతు వస్తోంది. డిజె సౌండ్‌లపై పలుసార్లు కొన్ని ఫిర్యాదులు వస్తున్నాయి. గతేడాదితో పోల్చి చూస్తే ఈసారి 45 శాతం ఎఫ్ఐఆర్‌లు పెరిగాయి. పెరిగిన వాటిలో చిన్నచిన్న చోరీలు, యాక్సిడెంట్ కేసులున్నాయి. గతంలో చిన్న ఫిర్యాదులు వచ్చినప్పుడు ఎఫ్ఐఆర్ నమోదు అయ్యేది కాదు. ఇప్పుడు ప్రతీ చిన్న నేరానికి ఎఫ్ఐఆర్ నమోదైంది. అందుకే కేసుల సంఖ్య పెరిగింది. ఇక కిడ్నాప్ కేసులు 85 శాతం పెరిగాయి. సెల్‌ఫోన్ల చోరీల సంఖ్య కూడా పెరిగింది. సైబర్ నేరాల వలలో పడి కేటుగాళ్ల చేతిలో డబ్బు పోగొట్టుకున్నవాళ్ల సంఖ్య పెరుగుతోంది. ప్రజల్లో ఎంత అవగాహన కల్పించినా కూడా మళ్లీ మళ్లీ మోసపోతూనే ఉన్నారు. ముఖ్యంగా డిజిటల్ అరెస్టు అనగానే చాలామంది డబ్బులు పోగొట్టుకుంటున్నారు. పెట్టుబడుల విషయంలో కూడా చాలామంది మోసపోతున్నారు. గతేడాది కంటే ఈసారి 91 శాతం ఎక్కువగా డబ్బులు పోగొట్టుకున్నారు. కరెంట్ ఖాతాల నుంచే సైబర్ నేరాలు ఎక్కువవుతున్నాయి. ఎలాంటి విచారణ లేకుండానే కొందరికి బ్యాంక్ సిబ్బంది కరెంట్ ఖాతాలు ఇస్తున్నారు. అంతేకాదు కొందరు బ్యాంకు సిబ్బంది సైబర్ నేరగాళ్లకు కూడా సహకరిస్తున్నారని" సీవీ ఆనంద్ చెప్పారు.

## చదరంగంలో చంద్రబాబు మనవడు దేవాన్ష్ ప్రపంచ రికార్డు



**హైదరాబాద్, డిసెంబర్ 22 (ప్రభాత ఉదయం):** ముఖ్యమంత్రి చంద్రబాబు మనవడు, మంత్రి నారా లోకేష్ తనయుడు దేవాన్ష్ చదరంగం లో ప్రపంచ రికార్డ్ సృష్టించారు. వేగంగా పావులు కదపడంలో నారా దేవాన్ష్ ప్రపంచ రికార్డు నెలకొల్పారు. 9 ఏళ్ల నారా దేవాన్ష్ "వేగవంతమైన చెక్‌మేట్ సాల్వర్ - 175 పజిల్స్" ప్రపంచ రికార్డు కైవసం చేసుకున్నారు. ప్రతిష్టాత్మకమైన వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ లండన్ నుంచి అధికారిక ధృవీకరణను దేవాన్ష్ అందుకున్నారు. దేవాన్ష్ ఘనత పట్ల నారా కుటుంబం హర్షం వ్యక్తం చేస్తోంది.

"చెక్‌మేట్ మారథాన్" పేరుతో ప్రపంచ రికార్డు: వ్యూహాత్మకమైన ఆటతీరు, థ్రిల్లింగ్ ప్రదర్శనతో యువ చెస్ ప్రాడిజీ నారా దేవాన్ష్ "చెక్‌మేట్ మారథాన్" పేరుతో ప్రపంచ రికార్డును నెలకొల్పాడు. ఈ రికార్డ్‌లో దేవాన్ష్ క్రమక్రమంగా సవాలు చేసే చెక్‌మేట్ పజిల్ల క్రమాన్ని పరిష్కరించాడు. ప్రసిద్ధ చెస్ సంకలనం నుంచి ఎంపిక చేసిన 5334 సమస్యలు, కలయికల ద్వారా ఈ పోటీని రూపొందించారు. తల్లిదండ్రుల ప్రోత్సాహం, కోచ్ మార్గదర్శకత్వంతో దేవాన్ష్ ఈ రికార్డును సాధించగలిగాడు. ఇటీవల దేవాన్ష్ మరో రెండు ప్రపంచ రికార్డులను కూడా సాధించాడు. అతను 7 డిస్క్ టవర్ ఆఫ్ హనోయిని కేవలం 1నిమిషం 43సెకన్లలో పూర్తి చేసాడు. 9 చెస్ బోర్డ్‌లను కేవలం 5 నిమిషాల్లో అమర్చాడు. మొత్తం 32 ముక్కలను వేగవంతంగా సరైన స్థానాల్లో ఉంచాడు. దేవాన్ష్ ప్రపంచ రికార్డు ప్రయత్నాలను న్యాయనిర్ణేతలు, లండన్‌లోని వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ అధికారులు క్షుణ్ణంగా పరిశీలించారు. పట్టుదల, కృషి ద్వారా తమ కలలను సాధించవచ్చని దేవాన్ష్ నిరూపించాడు. ఇది భారతీయ పిల్లల అపారమైన ప్రతిభకు, వారిలో దాగివున్న అత్యుత్తమ నైపుణ్యాలకు మచ్చుతునక. సరైన ఎక్స్‌పోజర్, మార్గదర్శకత్వంతో పిల్లలు ఉన్నతస్థానానికి చేరుతారనడానికి దేవాన్ష్ నిదర్శనమనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. హర్షం వ్యక్తం చేసిన లోకేశ్: దేవాన్ష్ లేజర్ షార్ప్ ఫోకస్‌తో శిక్షణ పొందడం తాను ప్రత్యక్షంగా చూశానని తండ్రి, రాష్ట్ర మంత్రి లోకేష్ ఈ ఘనత పట్ల హర్షం వ్యక్తం చేశారు. దేవాన్ష్ ఈ క్రీడను ఎంతో ఇష్టంగా స్వీకరించాడని తెలిపారు. అతను గ్లోబల్ అరేనాలో భారతీయ చెస్ క్రీడాకారుల అద్భుతమైన, చారిత్రాత్మక ప్రదర్శనల నుంచి ప్రేరణ పొందాడని వెల్లడించారు. దేవాన్ష్ కు చెస్ పాఠాలు నేర్పిన రాయ్ చెస్ అకాడమీకి లోకేష్ ధన్యవాదాలు తెలిపారు. ఈ ఈవెంట్ కోసం దేవాన్ష్ గత కొన్ని వారాలుగా రోజుకు 5-6 గంటల పాటు శిక్షణ పొందుతున్నాడన్నారు. దేవాన్ష్ సృజనాత్మకంగా చెస్ నేర్చుకునే ఒక డైనమిక్ విద్యార్థి అని ఆయన కోచ్ కె. రాజశేఖర్ రెడ్డి చెప్పారు. 175 సంక్లిష్టమైన పజిల్స్‌ని ఆసక్తిగా పరిష్కరించగలిగిన మానసిక చురుకుదనం దేవాన్ష్ సొంతమని తెలిపారు. అతని చదరంగం ప్రయాణంలో ఇదొక మైలురాయి అని వెల్లడించారు.



## దాడిని ఖండించిన సీఎం రేవంత్ రెడ్డి

**హైదరాబాద్, డిసెంబర్ 22 (ప్రభాత ఉదయం):** సినీ ప్రముఖుల ఇండ్లపై దాడి చేయడాన్ని సీఎం సీఎం రేవంత్ రెడ్డి ఖండించారు. రాష్ట్రంలోనూ శాంతిభద్రతల పరిరక్షణ విషయంలో పోలీసులు కఠినంగా వ్యవహరించాలని ఆదేశించారు. ఈ విషయమై తగు చర్యలు తీసుకోవాలని డీజీపీ, నగర పోలీస్ కమిషనర్‌లను ఆదేశిస్తున్నట్లు ఆదివారం 'ఎక్స్ (మాజీ ట్విట్టర్)'లో చేసిన పోస్టులో తెలిపారు. ఈ విషయంలో ఎలాంటి అలసత్వాన్ని సహించేది లేదని స్పష్టం చేశారు. అలాగే సంధ్య థియేటర్ ఘటన విషయంలో సంబంధం లేని పోలీసులు స్పం దించవద్దని పేర్కొన్నారు. ఇతర సిబ్బంది స్పందించకుండా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. కొందరు ఓయూ జేఏసీ నాయకులు జుబ్లీ హిల్స్‌లోని అల్లు అర్జున్ ఇంటికి వెళ్లి విధ్వంసం సృష్టించిన నేపథ్యంలో సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలకు ప్రాధాన్యం ఏర్పడింది.

## ఇకపై పోలింగ్ సీసీటీవీ ఫుటేజ్ చెక్ చేసేందుకు నో ఛాన్స్

మొదటి పేజీ తరువాయి...

పత్రాలు, డాక్యుమెంట్లు తనిఖీకి అందుబాటులో ఉంటాయి. పోలింగ్ బూత్‌లలోని సీసీ టీవీ కెమెరాల తనిఖీవల్ల ఓటర్ల గోప్యతకు భంగం కలుగుతోందని, అందుకే నిషేధం విధించామని ఈసీ వర్గాలు వెల్లడించాయి.

ఈ ఫుటేజ్‌ను వినియోగించుకుని కృత్రిమ మేధ ద్వారా నకిలీ వీడియోలను తయారు చేస్తున్నారని తెలిపాయి. రూల్ 93కి సవరణ తర్వాతా అభ్యర్థులకు ఎలక్ట్రానిక్ రికార్డులు అందుబాటులో ఉంటాయని, కానీ ఇతరులు తనిఖీ చేయడానికి అనుమతి ఉండదని వివరించాయి. హరియాణా ఎన్నికలకు సంబంధించిన అన్ని రికార్డులను మహమ్మద్ ప్రాచా అనే వ్యక్తికి షేర్ చేయాలని ఇటీవల పంజాబ్ అండ్ హరియాణా హైకోర్టు ఆదేశించింది. రూల్ 93 (2)లో పత్రాలు, డాక్యుమెంట్లు, ఎలక్ట్రానిక్ రికార్డులనే విభజన లేనందున అన్ని రికార్డులను ఇవ్వాల్సిందేనని స్పష్టం చేసింది. అయితే దీనిని ఈసీ వ్యతిరేకించింది. ఈ నేపథ్యంలో ఎన్నికల నిబంధనలకు సవరణ చేసింది.

**ఈసీ ఎందుకు భయపడుతోంది? కాంగ్రెస్**

అయితే ఎన్నికల నిబంధనను మార్చడంపై కాంగ్రెస్ ఆగ్రహం వ్యక్తం చేసింది. పారదర్శకతకు ఈసీ ఎందుకు భయపడుతోందని ప్రశ్నించింది. ఈ సవరణను న్యాయపరంగా సవాలు చేస్తామని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ శనివారం స్పష్టం చేశారు. కోర్టు తీర్పును పాటించాల్సిన ఈసీ, అందుకు విరుద్ధంగా నిబంధనలకు సవరణ చేయడం విడ్డూరమని వ్యాఖ్యానించారు.

# అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన అమిత్ షాను కేంద్ర మంత్రి పదవి నుండి బహిష్కరించాలి

### ఆల్ ఇండియా షెడ్యూల్ క్యాస్ట్ రైట్స్ ప్రొటెక్షన్ సొసైటీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు దాసరి రమేష్



ప్రతిజ్ఞ చేస్తున్న దళిత నేతలు



అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

రాజేంద్రనగర్, డిసెంబర్ 22(ప్రభాత ఉదయం) భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా ను కేంద్ర మంత్రి మండల నుండి తొలగించాలని ఆల్ ఇండియా షెడ్యూల్ క్యాస్ట్ రైట్స్ ప్రొటెక్షన్ సొసైటీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు దాసరి రమేష్ డిమాండ్ చేశారు. ఆదివారం జాతీయ షెడ్యూల్డ్ కులాల హక్కుల పరిరక్షణ సంస్థ రంగారెడ్డి జిల్లా స్థాయి కమిటీ సమావేశం బుద్వేల్ అంబేద్కర్ యూత్ కమిటీ హాలులో అధ్యక్షులు దాసరి రమేష్ అధ్యక్షతన జరిగింది. ముందుగా భారత రత్న అంబేద్కర్ విగ్రహానికి పూలమాల ఆవిష్కరించి ఘన నివాళి అర్పించినారు. పార్లమెంట్ సాక్షిగా కేంద్ర మంత్రి అమిత్ షా అంబేద్కర్‌ని కించపరచినందుకు తాను క్షమాపణ చెప్పాలని,మంత్రివర్గం నుండి బర్రఫ్ చేయాలని కోరారు.. ఆల్ ఇండియా షెడ్యూల్డ్ క్యాస్ట్ రైట్స్ ప్రొటెక్షన్ సొసైటీ జాతీయ స్థాయి సమావేశం త్వరలో రాజేంద్ర నగర్ సర్కిల్‌లో జాతీయ అధ్యక్షులు దళిత రత్న రాజు ఉస్తాద్ అధ్వర్యంలో నిర్వహించాలని నిర్ణయించారు. ఈ సమావేశంలో సంస్థ సభ్యుల చేత అసోసియేషన్ ముఖ్య సలహాదారు డాక్టర్ వేము వందనం ప్రతిజ్ఞ చేయించగా, శ్రీ పచ్చ శ్రీనివాస్ సంస్థ చరిత్రను తెలియజేయగా తెలియజేశారు. ఎమ్ సి వీరన్న, టి అశోక్ కుమార్, ఎమ్ శివకుమార్, సంస్థ సిద్ధాంతాలు భవిష్యత్తు కార్యచరణల గురించి మాట్లాడారు. ఈ సమావేశంలో సాయి కృష్ణ, వై కిరణ్ కుమార్, ఇ కన్నయ్య, నవీన్ కుమార్, వై నందరాజ్ తదితరులు పాల్గొన్నారు.. సంస్థ ఆర్గనైజింగ్ సెక్రేటరీజ శ్రీశైలం వందన సమర్పణతో సభ తో ముగించారు.



డ్రై క్లీనింగ్ దుకాణం లో మంటలు

## డ్రై క్లీనింగ్ దుకాణంలో మంటలు

బుద్వేల్, డిసెంబరు22(ప్రభాత ఉదయం):అత్తాపూర్ తేజస్వీనీ నగర్ కాలనీలో గల ఓ డ్రై క్లీనింగ్ దుకాణంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగాయి. దుకాణంలో ఉన్న బట్టలు అన్ని తగులబడిపోయాయి. వివరాలు ఈ విదంగా ఉన్నాయి.. జమాల్ అనే వ్యక్తి తేజస్వీనీనగర్ కాలనీలో డ్రై క్లీనింగ్ దుకాణం నిర్వహిస్తున్నాడు. ఆదివారం తెల్లవారు జామున డ్రై క్లీనింగ్ దుకాణంలో షార్ట్ సర్క్యూట్ జరిగి మంటలు చెలరేగాయి. దీంతో దుకాణంలోని వసు బివులు, బట్టలు కాలి బుడిదయ్యాయి. జమాల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న అత్తాపూర్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నామన్నారు.



పెంటయ్య గౌడ్‌కు నివాళులు అర్పిస్తున్న యువనేత కార్తీక్ రెడ్డి

## పెంటయ్యకు నివాళులర్పించిన కార్తీక్ రెడ్డి

రాజేంద్రనగర్, డిసెంబర్ 22(ప్రభాత ఉదయం) రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని బుద్వేల్ కు చెందిన స్థానిక నాయకుడు తానేష్ గౌడ్ తండ్రి పెంటయ్య గౌడ్ ఆదివారం మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న తెలంగాణ శాసనమండలి మాజీ చైర్మన్ కే స్వామి గౌడ్,బి ఆర్ ఎస్ యువనేత కార్తీక్ రెడ్డి బుద్వేల్ కు చేరుకుని పెంటయ్య పార్థీవ దేహం పై పుష్పగుచ్చం ఉంచి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు. పెంటయ్య కు నివాళులు అర్పించిన వారిలో రాజేంద్రనగర్ డివిజన్ కార్పొరేటర్ పొడవు అర్చన జయప్రకాష్, సీనియర్ నాయకులు కోలన్ సుభాష్ రెడ్డి, జాలిగం చిత్తారి, పచ్చ శ్రీనివాసులు ఉన్నారు.



జె. రుద్ర కుమార్

## రాజేంద్రనగర్ మండల సీపీఎం కార్యదర్శిగా జె.రుద్ర కుమార్

బుద్వేల్, డిసెంబరు22(ప్రభాత ఉచయం): సీపీఎం రాజేంద్రనగర్ మండల కార్యదర్శి గా జె.రుద్రకుమార్ నియమితులైనారు. ఆదివారం కాటేదాన్లోని సీపీఎం కార్యాలయంలో జరిగిన సమావేశంలో సీపీఎం పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జాన్ వెస్లీ, రంగారెడ్డి జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.చంద్రమోహన్ ల ఆధ్వర్యంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు.

### నూతన కమిటీ సభ్యులు వీరే

రాజేంద్రనగర్ మండల సీపీఎం కమిటీ కార్యదర్శి గా జె.రుద్రకుమార్ నియమితులైనారు. మండల కమిటీ సభ్యులుగా జీ.కురుమయ్య, జీఎం గట్టయ్య, ఎస్.రామ్మోహన్ రావు, ఎన్.జంగయ్య, ఎస్.మోహన్, భాస్కర్, కాలే రాజు, బచ్చులకూర స్వామీ, సువార్త, మనమ్మలను ఎన్నుకున్నారు. ఈ కమిటీ ఆధ్వర్యంలో రాజేంద్రనగర్ మండలంలో సీపీఎంను బలోపేతం చేయడంతో పాటు ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం చేయడం జరుగుతుందన్నారు.

## చంపుతానని బెదిరించిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని పోలీసులను ఆశ్రయించిన బాదితులు

బుద్వేల్, డిసెంబరు22(ప్రభాత ఉదయం): కయ్యూమ్ నగర్‌లో అబుల్ హసన్ అనే వ్యక్తి కి చెందిన కుక్క తన స్నేహితుని అల్లుణ్ణి నెల రోజుల క్రితం కరవడంతో అలీ అగా తో పాటు అతని స్నేహితుడు తాజామ్ముల్ లు అబుల్ హాసన్ పై ఫిర్యాదు చేశారు. దీంతో నెల రోజులుగా అబుల్ హసన్ తనపై పెట్టిన కేసును వెనుకకు తీసుకోవాలని అలీ అగా తో పాటు తాజామ్ముల్ లను కోరుతున్నాడు. దానికి వారు ఒప్పుకోకపోగా ఆదివారం తిరిగి అత్తాపూర్ పోలీస్ స్టేషన్ కు వెళ్లి అబుల్ హసన్ పై చర్యలు తీసుకోవాలని కోరారు. దీంతో పోలీసులు ఆదివారం అబుల్ హసన్ ఇంటికి వెళ్లారు. ఆ విషయాన్ని తెలుసుకున్న అబుల్ హసన్ అలీ అగా తో పాటు తాజమ్ముల్ దగ్గరకి వెళ్లి తనపై పెట్టిన కేసును వాపస్ తీసుకోకపోతే చంపేస్తాను అని బెదిరించాడు. దీంతో భయాందోళనలకు గురైన ఆలీ అగా, తాజమ్ముల్ లు తిరిగి అత్తాపూర్ పోలీసులను ఆశ్రయించారు. కేసు దర్యాప్తు లో ఉందని అత్తాపూర్ ఇన్స్పెక్టర్ టి. వెంకట్రామిరెడ్డి తెలిపారు.



కేంద్ర మాజీ మంత్రి జి వెంకట స్వామీ చిత్ర పటానికి నివాళులు అర్పిస్తున్న వ్యవసాయ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య తదితరులు

## కేంద్ర మాజీ మంత్రి జి.వెంకటస్వామికి నివాళులు

బుద్వేల్, డిసెంబరు22 (ప్రభాత ఉదయం): కేంద్ర మాజీ మంత్రి జి.వెంకటస్వామీ వర్ధంతిని ఆదివారం రాజేంద్రనగర్ లోని వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిపాలన భవనంలో నిర్వహిం చారు. జి.వెంకటస్వామీ చిత్రపటానికి వ్యవసాయ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ అల్దాస్ జానయ్య పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వర్శిటీ పరిశోధనా సంచాలకులు డాక్టర్ పి.రఘు రామిరెడ్డి, డాక్టర్ ఈశ్వరీ తదితరులు పాల్గొన్నారు.




ర్యాలీ నిర్వహిస్తున్న సిఐటియు నాయకులు

## రాజేంద్రనగర్ మండల సిపిఎం రెండవ మహాసభ

రాజేంద్రనగర్, డిసెంబర్ 22(ప్రభాత ఉదయం) సిపిఎం పార్టీ రాజేందర్ నగర్ మండల రెండవ మహాసభ కామ్రేడ్ బి చిట్టెమ్మ ప్రాంగణం పేరుతో నిర్వహించారు. ఆదివారం రాజేంద్రనగర్ మండలం సిపిఎం పార్టీ మండల మహాసభ సిఐటియు రంగారెడ్డి జిల్లా ఆఫీస్ కాటేదాన్ లో నిర్వహించడం జరిగింది. ఈ మహాసభకు సిపిఎం పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జాన్ వెస్లీ . సిపిఎం పార్టీ రంగారెడ్డి జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం చంద్రమోహన్ ఇరువురు హాజరై కాటేదాన్ చౌరస్తా నుండి సిఐటియు ఆఫీస్ వరకు సిపిఎం పార్టీ కార్యకర్తలతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం మహాసభను ద్వేషించే వారు మాట్లాడుతూ ... దేశంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం కార్మిక చట్టాలను కాలరాస్తూ ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తూ పేద, మధ్యతరగతి ప్రజల జీవితాలతో ఆటలాడుతుందన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా కనీస వేతనం సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం అమలు చేయకుండ దేశంలో కులమత బేధాలు రెచ్చగొడుతూ దేశాభివృద్ధి గాలికి వదిలేయడం జరిగిందన్నారు. దాంతోపాటు బడా పెట్టుబడిదారులు కార్పొరేట్ సంస్థలకు కోట్ల రూపాయలు రాయితీలు ఇస్తూ పేద ప్రజల జీవితాలతో ఆటలాడుతుందన్నారు. బిజెపి ప్రభుత్వం ఈ మధ్యకాలంలో పార్లమెంట్ సాక్షిగా అమిత్ షా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ని అవహేళన చేశారని గుర్తు చేశారు. తెలంగాణ రాష్ట్రంలో గతంలో ఉన్న ప్రభుత్వం పేదలు బడుగు బలహీన వర్గాలు కార్మికులు తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి మొత్తాన్ని గాలికి వదిలేసి నేను చెప్పింది వేదం అన్నట్టు విర్రవీగిన టిఆర్ఎస్ ప్రభుత్వానికి బుద్ధి చెప్పి తెలంగాణ రాష్ట్ర ప్రజలు కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకురావడం జరిగిందన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరో వాగ్దానాలు వెంటనే అమలు చేయాలి అలా కాకుండా కాలయాపన చేస్తున్నారని ఆరోపించారు. సిపిఎం పార్టీ సభ్యులుగా కార్యకర్తలుగా మనమంతా కలిసి ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొడుతూ కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాలపై న్యాయమైన పోరాటాలు చేసి మనకు రావాల్సిన వాటాను హక్కును సాధించుకోవాలని పిలుపునిచ్చారు .

### రాజేంద్రనగర్ మండల సిపిఎం నూతన కార్యవర్గం...

నూతన సిపిఎం పార్టీ రాజేంద్రనగర్ మండల కమిటీ నీ ఎన్నుకున్నారు. సిపిఎం పార్టీ మండల కార్యదర్శిగా జాజాల రుద్ర కుమార్ , మండల కమిటీ సభ్యులుగా జిఎం కురుమయ్య, జిఎం గట్టయ్య ,ఎస్ రామ్మోహన్ రావు ,ఎన్ జంగయ్య, ఎస్ మోహన్ , భాస్కర్ , కాలే రాజు , బచ్చులకూర స్వామి, సువార్త ,మన్నెమ్మ లను ఎన్నుకున్నారు. ఈ మహాసభలో. ఈ నూతన కమిటీ రాబోయే రోజుల్లో ఈ ప్రాంతంలో నిరంతరం ప్రజల సమస్యల పై పోరాటం చేస్తుందని పేర్కొన్నారు. ఈ మహాసభకు పార్టీ సభ్యులు 85 మంది వరకు హాజరయ్యారు.



## నేడు పెద్ద తూప్ర, పాల్మాకులలో విద్యుత్ సరఫరాలో అంతరాయం

శంషాబాద్, డిసెంబర్ 22(ప్రధాత ఉదయం) షాపూర్ విద్యుత్ సెక్షన్ పరిధిలోని పెద్దతోప్రా విద్యుత్ ఫీడర్ ప్రాంతాలలో సోమవారం ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం రెండు గంటల వరకు, పాలమకుల పారిశ్రామిక, వ్యవసాయ విద్యుత్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం రెండు గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు వివిధ మరమ్మత్తుల నిమిత్తం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని శంషాబాద్ సబ్ డివిజన్ విద్యుత్ అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ రమేష్ తెలిపారు. పెద్ద తూప్ర, పెద్ద తూప్ర తాండ, కేకే బస్తీ, ఐఓసీ తాండ, ఇనాం చెరి, మదనపల్లి తాండ ప్రాంతాలలో విద్యుత్ సరఫరాల అంతరాయం ఉంటుందని ఏడిఈ రమేష్ తెలిపారు. విద్యుత్ వినియోగదారులు ఈ అంతరాయానికి సిబ్బందికి సహకరించాలని ఆయన కోరారు.



కేంద్ర మాజీ మంత్రి జీ వెంకట స్వామి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉపకులపతి అల్దాస్ జానయ్య

## వ్యవసాయ విశ్వవిద్యాలయంలో స్వర్గీయ కేంద్ర మంత్రి జీ వెంకటస్వామి వర్ధంతి

### వెంకటస్వామి చిత్రపటానికి నివాళులర్పించిన ఉపకులపతి జానయ్య


రాజేంద్రనగర్, డిసెంబర్ 22(ప్రభాత ఉదయం) కేంద్ర మాజీ మంత్రి దివంగత జీ వెంకటస్వామి వర్ధంతిని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం లో ఆదివారం నిర్వచించారు. పరిపాలన భవనంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఉపకులపతి ప్రొఫెసర్ జానయ్య, వెంకట్ స్వామి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ ఉన్నతాధికారులు, బోధనా, బోధనేతర సిబ్బంది, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు వెంకట స్వామి చిత్రపటానికి నివాళులర్పించారు.

# గద్వాల కోర్టు సముదాయం నిర్మాణం మెజార్టీ ప్రజల అభిప్రాయాన్ని పరిగణలోకి తీసుకుంటాం

## సమస్యను సీఎం దృష్టికి తీసుకెళ్తాం

## నాగర్ కర్నూల్ ఎంపి మల్లు రవి, మాజీ ఎమ్మెల్యే సంపత్

గద్వాల జిల్లా ప్రతినిధి, డిసెంబర్ 22(ప్రభాత ఉదయం) జోగులాంబ గద్వాల జిల్లా కోర్టు సముదాయ నిర్మాణం కోసం అనంతపురం గుట్టలో కేటాయించిన స్థలాన్ని వెంటనే రద్దు చేయాలని కోరుతూ గత కొంతకాలంగా గద్వాల బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిరసన దీక్షలు చేపట్టారు. ఈ నేపథ్యంలో గద్వాల బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఆర్. రఘురామి రెడ్డి అద్వర్యంలో న్యాయవాదుల బృందం పార్లమెంట్ సభ్యులు డాక్టర్ మల్లు రవి, ఏఐసిసి కార్యదర్శి సంపత్ కుమార్ లను హైదరాబాదులోని వారి నివాసాలల్లో ఆదివారం వేరువేరుగా కలిసి విన్నపించారు. ఈ సందర్భంగా వారు న్యాయవాదులతో సమావేశమై చాల సేపు ఈ సమస్యపై చర్చించారు. దాదాపు గంటన్నర పాటు ఈ భేటీలు సాగాయి. గతంలో తీసుకొన్న స్థలం నిర్ణయం ఇప్పుడు ఎందుకు మార్చాలి? అందుకు గల బలమైన కారణాలేమిటో తెలుసుకున్నారు. పూడురు శివారులో కోర్టు నిర్మిస్తే ప్రజలకు, న్యాయవాదులకు కలిగే ఇబ్బందులు, అసౌకర్యాలను సీనియర్ అద్వకేట్లు సుధాకర్, ఖాజా మోహినుద్దీన్, ఇస్మాయిల్, విష్ణువర్ధన్ రెడ్డి తమ వెంట తెచ్చుకున్న మెటీరియల్ ఇతర ఆధారాలను ఎంపీ, మాజీ ఎమ్మెల్యే ముందు ఉంచారు. తమ మొదటి ప్రాధాన్యత పిజెపి కాలని లోనేనని అక్కడే న్యాయస్థాన సముదాయం ఉంటే మూడు ప్రధాన వ్యవస్థలు ఒకే చోటకు చేరి ప్రజల అవసరాలు తీరుస్తాయి ఇతర బార్



సభ్యులు వారికి తెలియజేసారు. ఈ సందర్భంగా గద్వాల కోర్టు సముదాయాన్ని మెజార్టీ ప్రజలు మరియు న్యాయవాదుల నిర్ణయం అమలు కావడానికి మా వంతు బాధ్యత తీసుకుంటామని పార్లమెంట్ సభ్యులు మల్లు రవి, ఏఐసిసి కార్యదర్శి సంపత్ కుమార్ లు అన్నారు. జిల్లా ఇంచార్జి మంత్రి దామోదర్ రాజ నరసింహతో సమావేశమై స్థానిక నేతలతో పాటు అందరి అభిప్రాయాలను పరిగణలోకి తీసుకుంటామన్నారు. అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి విషయాన్ని తీసుకెళ్లి సమస్య పరిష్కారం చేస్తామన్నారు. మెజార్టీ అభిప్రాయం ఆమోదం పొందడానికి మా వంతు కృషి కచ్చితంగా ఉంటుందని గద్వాల న్యాయవాదులకు ఇద్దరు నేతలు భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గద్వాల అసెంబ్లీ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి సరితా తిరుపతయ్య, సీనియర్ న్యాయవాదులు కృష్ణమోహన్ రెడ్డి, గట్టు సురేష్, రవి ప్రకాష్ గౌడ్, మదన్మోహన్ రెడ్డి, రాజశేఖర్ రెడ్డి, నర్సింలు, ఆనంద్ రావులతో పాటు నాయకులు లత్తిపురం వెంకటరామిరెడ్డి, నాగర్ దొడ్డి వెంకట్రాములు, శంకర్, ఇషాక్, అచ్చన్నగౌడ్, కృష్ణారెడ్డి, మాల శ్రీనివాసులు, జూనియర్ న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.




# చెన్నై ఎగ్మోర్ రైలులో మంటలు..

## గద్వాల స్టేషన్‌లో నిలిపివేత

గద్వాల జిల్లా ప్రతినిధి, డిసెంబర్ 22(ప్రభాత ఉదయం) గద్వాల రైల్వేస్టేషన్‌లో చెన్నై ఎగ్మోర్ రైలును ఆదివారం అధికారులు నిలిపివేశారు. అకస్మాత్తుగా రైలు ఎక్స్‌ప్రెస్ బోగీలో నుంచి దట్టంగా పొగలు వ్యాపించాయి. దాంతో అధికారులు వెంటనే రైలును ఆపి.. ప్రయాణికులను దింపివేశారు. వివరాలకు వెళ్లితే... కాచిగూడ నుంచి చెన్నైకి బయలుదేరిన రైలులో మంటలు చెలరేగాయి. ఎక్స్‌ప్రెస్ రైలులోని ఎనిమిదో నెంబర్ ఏసీ బోగిలో పొగలు అలుముకున్నాయి. ఈ ఘటనతో ఒక్కసారిగా ప్రయాణికులు భయాందోళనకు గురయ్యారు. ఏం జరుగుతుందో తెలియక కేకలు వేశారు. ఆ తర్వాత అధికారులు ప్రయాణికులను బోగీల నుంచి ప్రయాణికులను దింపారు. అసలు రైలులో పొగలు రావడానికి కారణాలు ఇంకా తెలియరాలేదు. ప్రస్తుతం అధికారులు ఘటనపై విచారణ జరుపుతున్నారు.



# యథేచ్ఛగా చెట్ల నరికివేత

## కర్ణాటకకు తరలుతున్న తెలంగాణ కలప

గద్వాల జిల్లా ప్రతినిధి, డిసెంబర్ 22(ప్రభాత ఉదయం)పర్యావరణాన్ని కాపాడడంతోపాటు పచ్చదనాన్ని పెంచాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఓవైపు హరితహారం కార్యక్రమంలో మొక్కలను నాటుతూ కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నది. మరోవైపు అక్రమార్కులు అటవీ ప్రాంతంలో, రైతు పొలాలలో ఏపుగా పెరిగిన చెట్లను నరుకుతూ పర్యావరణాన్ని నాశనం చేస్తున్నారు. గద్వాల అటవీశాఖ రేంజ్ పరిధిలోని కేటిదొడ్డి, గట్టు మండలాల అక్రమార్కులు వేప, తుమ్మ తదితర చెట్లను నరికి వేస్తున్నారు. రైతుల పొలాల వద్ద, దట్టమైన అటవీ ప్రాంతంలో అక్రమార్కులు పెద్దపెద్ద చెట్లను నరికి వేసి అటవీ ప్రాంతం నుంచి తరలిస్తున్నా పట్టించుకునే వారు కరువయ్యారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏపుగా పెరిగిన పెద్దపెద్ద చెట్లను నరకడంతో అటవీప్రాంతం అన్యాక్రాంతమవుతున్నదని ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం కోట్లాది రూపాయలు ఖర్చు పెట్టి హరితహారంలో మొక్కలను నాటుతుంటే మరోవైపు అడవుల్లో చెట్లను నరుకుతున్నా పట్టించుకునే వారు లేరనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా కేటిదొడ్డి, గట్టు మండలాల పరిధిలో అక్రమార్కులు ఎలాంటి అనుమతులు లేకుండా చెట్లను ఇష్టానుసారంగా నరికి వేస్తున్నారు. కూత వేటు దూరంలో కర్ణాటక సరిహద్దు ఉండటంతో అక్రమార్కులు చెట్లను నరికి వేసి ట్రాక్టర్ల ద్వారా కర్ణాటకకు తరలిస్తున్నారు. పట్టపగలే కర్ణాటకకు తరలిస్తున్న అటవీ శాఖ అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో అక్రమార్కుల ఇష్టారాజ్యంగా మారింది. సరిహద్దులో చెట్లను నరికివేస్తున్న వారిపై అధికారులు చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

**చర్యలు తీసుకుంటాం: మన్యమయ్య - అటవిశాఖ అధికారి**

కేటిదొడ్డి మండలంలో చెట్లను నరకకుండా తమ సిబ్బంది పర్యవేక్షిస్తున్నారు. కేటిదొడ్డి మండలంలో చెట్లు నరికిన విషయం నా దృష్టికి రాలేదు. చెట్లను నరికినవారిపై అటవీశాఖ చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటాం.



నూతన వధూవరులను ఆశీర్వదిస్తున్న సీనియర్ నాయకులు ఏం భీమ్ రెడ్డి

నూతన వధూవరులు

# జక్కా శశాంక్ రెడ్డి శ్రేయ రెడ్డిలను ఆశీర్వదించిన పెద్దలు

హైదరాబాద్, డిసెంబర్ 22(ప్రభాత ఉదయం) జక్కా శమంతకమణి, రఘునందన్ రెడ్డి దంపతుల కుమారుడు జక్కా శశాంక్ రెడ్డి వివాహం శ్రేయ రెడ్డిలతో ఆదివారం ఫిలింనగర్లోని జె ఆర్ సి కన్వెన్షన్ లో జరిగింది. ఈ వివాహ వేడుకల్లో ప్రముఖులు, పెద్దలు, నాయకులు పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు.

# తెలంగాణ ఇంటెలిజెన్స్ చీఫ్ శివధర్ రెడ్డి కుమారుడు వివాహం

## నూతన వధూవరులను ఆశీర్వదించిన ప్రముఖులు



శివధర్ రెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న సీనియర్ నాయకులు ఎం భీమ్ రెడ్డి

హైదరాబాద్, డిసెంబర్ 22(ప్రభాత ఉదయం) తెలంగాణ రాష్ట్ర ఇంటెలిజెన్స్ చీఫ్ శివధార్ రెడ్డి కుమారుడు కార్తీక్, ఆర్షి ల కళ్యాణ్ ఉత్సవం గోల్కొండ రిసార్ట్స్ లో ఘనంగా జరిగింది. ఈ వివాహ వేడుకలో సీనియర్ నాయకుడు భీం రెడ్డి, సీనియర్ జర్నలిస్టు జయ సింహ రెడ్డి, రాం చరన్ రెడ్డి, అక్షర రెడ్డి, సిరి రెడ్డి పాల్గొన్నారు.



రంగురంగుల దీపాలతో ముస్తాబైన శ్రీ వేణుగోపాలస్వామి ఆలయం

# వైభవంగా శ్రీ సంతాన వేణుగోపాల స్వామి రథోత్సవం

గద్వాల జిల్లా ప్రతినిధి, డిసెంబర్ 22(ప్రభాత ఉదయం) గద్వాల పట్టణంలో వెలసిన శ్రీ సంతాన వేణుగోపాల స్వామి వారి రథోత్సవ వేడుకలను ఆదివారం అంగరంగ వైభ వంగా నిర్వహించారు.రథోత్సవ వేడుకల సందర్భంగా రథంలో వేణుగోపాల స్వామి ఉత్సవమూర్తుల విగ్రహాలను శుభము హుర్తాన వేద పండితులు అధిరోహింపజేయగా భక్తు లు గోవింద నామ స్మరణలతో మార్మోగుతూ రథాన్ని ముందుకు కదిలించారు. గద్వాల పట్టణంలో పురవీధుల గుండా రథోత్సవ కార్యక్రమం నిర్వహించారు. అంతకుముందు ఆలయ ధర్మకర్తల ప్రస్తుతం రాజవంశస్తులైన సంయుక్తమ్మ, డాక్టర్ విక్రం సింహారెడ్డి, డాక్టర్ సుహాసిని రెడ్డి ఆధ్వర్యంలో రథోత్సవానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.రథోత్సవానికి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ఆలయ కమిటీ సిబ్బంది ఏర్పాట్లను చేపట్టారు. ఈ సందర్భంగా ఆలయాన్ని విద్యుత దీపాలతో ప్రత్యేకంగా అలంకరించి ముస్తాబు చేశారు.

# ప్రభుత్వమే సిగ్గులేకుండా 'పుష్ప'ను ప్రోత్సహించింది

## పుష్పపై సీపీఐ నారాయణ ఫైర్



**హైదరాబాద్, డిసెంబర్ 22 (ప్రభాత ఉదయం):** 'పుష్ప' సినిమా వివాదంలో మొదట తెలంగాణ ప్రభుత్వానే పొరపాటు అని సీపీఐ నేత నారాయణ అన్నారు. ఎర్ర చందనం స్మగ్లింగ్ చిత్రం బెనిఫిట్ షోలను నిర్వహించేందుకు పర్మిషన్ ఇవ్వడంతోపాటు టికెట్ ధరలు భారీగా పెంచేకునేలా ప్రోత్సహించిందంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆదివారం మీడియాతో మాట్లాడిన నారాయణ.. 'పుష్ప2' సంధ్య థియేటర్ ఘటనలో ప్రాణాలు కోల్పోయిన రేవతి కుటుంబానికి ప్రగాఢ సంతాపం తెలిపారు. తీవ్రంగా గాయపడిన ఆమె కొడుకు శ్రీతేజ్ త్వరగా కోలుకోవాలని కోరారు.

**స్మగ్లింగ్‌తో పాటు అసభ్యకరమైన పాటలు..**

ఈ సందర్భంగా ఓ వీడియోను విడుదల చేసిన ఆయన.. 'పుష్ప' చిత్రం ఎర్ర చందనం స్మగ్లింగ్ చేసుకోవాలని సందేశం ఇస్తోందా? అని ప్రశ్నించారు. స్మగ్లింగ్‌తో పాటు అసభ్యకరమైన పాటలు అందులో ఉన్నాయని, అయినప్పటికీ ప్రభుత్వం సిగ్గులేకుండా టికెట్లు పెంచుకునేందుకు అనుమతి ఇచ్చిందని మండిపడ్డారు. 'అదేమైన సమాజానికి ఉపయోగపడే సినిమానా? ప్రభుత్వం ఎందుకు ప్రోత్సహించాలి. దీనిలో పోలీసుల తప్పేం లేదు. ఇలాంటి ఘటనలపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలి. భవిష్యత్‌లో ఇలా జరగకుండా ఉండేందుకు సినిమా వర్గాలు, కళాకారులు, రాజకీయ నేతలు చర్యలు చేపట్టాలి. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి. త్వరలో మా వంతు సాయం ప్రకటిస్తాం' అని అన్నారు.

**జగపతి బాబు సానుభూతి..**

ఇదిలా ఉంటే సీనియర్ నటుడు జగపతి బాబు ఈ ఘటనపై స్పందించారు. 'సినిమా షూటింగ్ ముగించుకుని నేను ఊరి నుంచి రాగానే.. బాధిత కుటుంబాన్ని పరామర్శించేందుకు హాస్పిటల్‌కు వెళ్లా. చికిత్స పొందుతున్న బాలుడి తండ్రిని, సోదరిని పలకరించాలని అనిపించి అక్కడకు వెళ్లా.అందరి ఆశీస్సులతో త్వరగానే కోలుకుంటాడని వారికి భరోసా ఇచ్చా. అందరికంటే ఎక్కువ ఎఫెక్ట్ అయింది ఆ కుటుంబం కాబట్టి నా వంతు సపోర్టు ఇవ్వాలనుకున్నా. దానికి పబ్లిసిటీ చేయలేదు. అందుకే ఎవరికీ ఆ విషయం తెలియలేదు. దానిపై క్లారిటీ ఇవ్వడానికే ఈ పోస్టు..' అని పేర్కొన్నారు. పుష్ప 2' ప్రీమియర్ షో చూసేందుకు హైదరాబాద్‌లోని సంధ్య థియేటర్‌కు అల్లు అర్జున్ వెళ్లిన సంగతి తెలిసిందే. ఆయన్ను చూసేందుకు అభిమానులు పెద్ద సంఖ్యలో చేరుకోవడంతో తొక్కిసలాట జరిగింది. రేవతి అనే మహిళ మృతి చెందారు. ఆమె కుమారుడు శ్రీతేజ్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. సంబంధిత కేసులో అల్లు అర్జున్ ఇటీవల అరెస్టు అయి బెయిల్‌పై విడుదలయ్యారు. పలువురు సినీ ప్రముఖులు ఆయన ఇంటికి వెళ్లి పరామర్శించారు. కాగా బాధిత కుటుంబాన్ని పరామర్శించిన సినీ ప్రముఖుల్లో జగపతి బాబు మొదటి వ్యక్తి కావడం గమనార్హం.

# తెలంగాణలో డిజిటల్ అరెస్ట్.. రూ.15 లక్షలు ఫసక్!

## సైబర్ నేరగాళ్ల వలలో పడి రూ.7.50 లక్షలు పోగొట్టుకున్న యువతి

**హైదరాబాద్, డిసెంబర్ 22 (ప్రభాత ఉదయం):** దేశవ్యాప్తంగా సైబర్ నేరగాళ్లు రెచ్చిపోతున్నారు. సంపన్నులు, రిటైర్డ్ ఉద్యోగులు, వృద్ధులనే టార్గెట్‌గా పెట్టుకుంటున్నారు. గాలమేసి డబ్బులు కొట్టేస్తున్నారు. ఈ మధ్య డిజిటల్ అరెస్టు అంటూ చెలరేగిపోతున్నారు. బాధితులకు లక్షల్లో కుచ్చిటోపి పెడుతున్నారు. తాజాగా అలాంటిదే మరొకటి జరిగింది. తెలంగాణలో డిజిటల్ అరెస్ట్ వెలుగులోకి వచ్చింది. ఓ బాధితుడు కేటుగాళ్ల వలలో పడి సుమారు రూ.15 లక్షలు పోగొట్టుకున్నాడు. పూర్తి వివరాల్లోకి వెళితే..

**సైబర్ కేటుగాళ్ల నుంచి ఫోన్ కాల్**

ఖమ్మం జిల్లా వైరాకు చెందిన ఓ వ్యక్తికి సైబర్ కేటుగాళ్ల నుంచి ఫోన్ కాల్ వచ్చింది. మీ పేరు మీద శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి వేర్వేరు ప్రాంతాలకు ఐదు టికెట్లు బుక్ అయ్యాయని బాధితుడికి అవతల వ్యక్తి తెలిపాడు. అంతేకాకుండా ఒకే సమయంలో వేర్వేరు ప్రాంతాలకు టికెట్ ఎందుకు బుక్ చేసుకున్నారంటూ వరుస ప్రశ్నలు అడిగాడు. అయితే తాను ఎక్కడికీ టికెట్ బుక్ చేయలేదని బాధితుడు చెప్పాడు. అనంతరం ఆ కేటుగాడు బాధితుడి వాట్సాప్ నెంబర్‌కు వీడియో కాల్ చేశాడు. తాము సీబీఐ అధికారులమంటూ వీడియో కాల్ ద్వారా బాధితున్ని నమ్మించాడు. ఆపై మీ పేరు మీద ఢిల్లీలో అకౌంట్ ఉందని హవాళా, మనీ లాండరింగ్, డ్రగ్స్ లావాదేవీలన్నీ సదరు అకౌంట్ నుంచి జరుగుతున్నట్లు గుర్తించామని సైబర్ నేరగాళ్లు బాధితుడికి చెప్పి భయపెట్టారు. అక్కడితో ఆగకుండా ఇదే కేసుకు సంబంధించి ఓ వ్యక్తిని సైతం అరెస్ట్ చేశామని మరింత చెమటలు పట్టించారు. అరెస్టు చేసిన వ్యక్తి వద్ద నుంచి లభించిన కీలక డాక్యుమెంట్స్ ఆధారంగా మిమ్మల్ని విచారిస్తున్నామని బాధితుడిని వణికించారు.

Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: KOTLA CHANDRA KANTH. "RNI. Title- Code: TELTEL12231**. Cell: 9705231654.